# గుర్తు

ఉదయం ఎనిమిదింటికి కాఫీ తాగి వరండాలో కూర్చుని దినపత్రిక తిరగవేస్తూంటే మా క్వార్టర్స్ ప్రహరీ గోడ తలుపు తెర్చుచుకున్న చప్పుడయింది. తలెత్తి మా దర్వాను లోపలికి వస్తూ సెల్యూట్ ఒకటి విసిరి, "మీకోసం ఎవరో వచ్చారు" అన్నాడు.

దినపత్రిక మడిచి, 'ఎవరు?' అనబోతుండగా పాపాజీ ముందుకు వచ్చాడు.

"మీకితను తెలిసినతనే కదూ?" అడిగాను దర్వాను.

"తెలుసు" అన్నాను.

దర్వాను వెళ్ళిపోయాక పాపాజీ వంక చూశాను. వాడి బట్టలు మట్టి కొట్టుకుపోయి మురికిగా ఉన్నాయి. చేతిలో చిన్న గుడ్డసంచి ఉంది. వాడు నా తమ్ముడు. నా తర్వాతివాడు. వాడావిధంగా నాదగ్గరకు రావడం ఇష్టంగా అనిపించలేదు.

"ఈ ఉదయమే వచ్చాను..." అన్నాడు సంజాయిషీగా. నాతో బిడియంగా మాట్లాడుతుంటాడు. మిగతా తమ్ముళ్ళలా ఫ్రీగా మాట్లాడడు. మునుపు ఇలా ఉండేవాడు కాదు.

"నువ్వు నాకు ఏమవుతావో దర్వాన్‌తో గాని చెప్పావా?"

"చెప్పలేదు. అడిగినా చెప్పేవాడిని కాదు" అని ఆగి, "అయ్యగారి ఊరు నుండి వస్తున్నాను అని మటుకు అన్నాను" అన్నాడు.

ఆమాట చిరాకుగా అనిపించింది.

"ఇంట్లో అందరూ ఎలా ఉన్నారు?" అడిగాను.

"బావున్నారు"

"గుంటూరులో ఎప్పుడు బయల్దేరావు?"

"మొన్న మధ్యాహ్నం. నీకు కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. ఎల్లుండిలోగా నువ్వు చేరాలని ఉంది. పోస్టులో పంపితే ఆలస్యం అవుతుందని ఈవేళలోపు నీకు అందేలా చూడమని అమ్మ చెపితే ఉన్నపళంగా బయల్దేరి వచ్చాను..." అని జేబులోంచి అపాయింటుమెంటు ఆర్డర్ తీసి భద్రంగా నా చేతికి అందిస్తున్నప్పుడు వాడి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. నాకూ సంతోషం వేసింది. కవరులోంచి ఆర్డరు బయటకు తీశాను. కెమిస్ట్రీ విభాగంలో లెక్చరర్‌గా ఇచ్చారు. మా కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం, అందునా గజిటెడ్ పోస్టు రావడం అదే మొదటిసారి.

"ఎలా వచ్చావు?" అడిగాను.

గుంటూరు నుండి మదనపల్లికి రైలుబండ్లు లేవు. బస్సులు డైరెక్టుగా లేవు.

అప్పటికి రాయలసీమలో బస్సులు జాతీయకరణం చేయలేదు. ప్రైవేటు బస్సులే నడుస్తున్నాయి. రాత్రి ప్రయాణాలు లేవు.

చిన్నగా నవ్వి, "మూడు నాలుగు లారీలు పట్టుకుని వచ్చాను..." తేలికగా అన్నాడు.

పాపాజీ ఎంత కష్టమైన పనయినా అవలీలగా చేస్తుంటాడు. అయితే అయిదేళ్ళుగా తను గ్రాడ్యుయేషన్ పూర్తి చేయలేకపోయాడు. ప్రతిసారీ తప్పడం అవుతుండేసరికి నిరాశకు లోనయ్యాడు. బేక్‌లాగ్‌లు మొదటి సంవత్సరం నుండి మిగిలిపోయాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుంటే ఏ ఉద్యోగంలో అయినా స్థిరపడి పోయేవాడు. అలా కాకపోయేసరికి ఆత్మన్యూనతాభావం బాగా పేరుకుపోయింది. వాడి తర్వాత తమ్ముళ్ళు, చెల్లెలు బాగా చదువుకుని పైకివచ్చి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. నేను భోపాల్‌కి ఎమ్మెస్సీకి వెళ్ళి ఉండకపోతే పాపాజీని ఒక దారికి తీసుకువచ్చి ఉండేవాడిని.

వాడి చదువు పూర్తి కాకపోవడానికి నేను కూడా ఒక కారణం. వాడికి సైన్స్ సబ్జక్టులంటే ఏమాత్రం ఇష్టం లేదు. సోషల్‌స్టడీస్ తీసుకుంటానన్నాడు. నేనే బలవంతంగా బియస్సీలో చేర్పించాను. వాడికి మొహమాటం ఎక్కువ. నా మాట తీసివేయలేకపోయాడు. నెగ్గుకు రాలేకపోయాడు.

పాపాజీకి ఇష్టమైన ఆట ఫుట్‌బాల్. సాయంత్రాలు ఏమాత్రం వీలుచిక్కినా ఫుట్‌బాల్ ఆడటానికి వెళ్ళిపోయేవాడు. వాళ్ళ కాలేజీలో సెంటర్ ఫార్వార్డుగా వాడిని మించినవాడు లేడు. చాలాసార్లు వాడి ఆటను చూశాను. బంతి వాడి కాలికి అందిందంటే చాలు, గోల్ అయినట్టే లెక్క. స్టేట్ లెవల్ వరకు వెళ్ళాల్సింది. వెళ్ళలేకపోయాడు. చదువు కుంటుపడుతుండడంలో ఆటమీద ఆసక్తి చతికిలబడింది. ఇంట్లోవాళ్ళ సూటిపోటి మాటలు పడలేక ఆటకు స్వస్తి చెప్పాడు. రెండింటికీ చెడ్డ రేవడి అయ్యాడు. వాడు కాబట్టి లారీలు పట్టుకుని నాకా అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకువచ్చాడు. మరో ఏ తమ్ముడయినా ఏదో సాకు చెప్పి తప్పించుకునేవాళ్ళు.

దినపత్రిక పేము కుర్చీలో పెట్టి, లేచి నుంచున్నాను. "ఇంట్లోకి రా" అని మధ్య గదిలోకి నడిచాను. నా కూడా గదిలోకి వచ్చాడు. నేను మదనపల్లి కాలేజిలో చేరిన తర్వాత మా ఇంటినుండి వచ్చిన మొదటి వ్యక్తి. స్నానాల గది చూపించి, "స్నానం చేయి. కొత్త సబ్బు గూట్లో ఉంది" అన్నాను. నేను వాడుతున్న సబ్బు వాడు

వాడడం నాకు ఇష్టం లేదు. నిజానికి వాడంటే అయిష్టపడాల్సిన కారణమంటూ ఏమీ లేదు.

"వస్తూ స్నానాల సబ్బు, గుడ్డల సబ్బు తెచ్చుకున్నాను..."

నన్ను చదవగలుగుతున్నాడు.

నేను భోపాల్ వెళ్ళకముందు ఈ తేడాలు, ముఖ్యంగా పాపాజీతో, ఉండనే ఉండేవి కావు. అప్పట్లో మనకు అట్టే విశ్వవిద్యాలయాలు ఉండేవి కాదు. ఉన్న మూడు విశ్వవిద్యాలయాల్లో సీట్లు ఎక్కువ ఉండేవి కావు. అయినా కులాల వారీగా ఇష్టాయిష్టాలు గోప్యంగా ఉంటుండేవి. ఇప్పుడు ఇన్ని కొత్త విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చినా పరిస్థితి అలానే ఉంది. ఎక్కువయినట్టు కూడా అనిపిస్తోంది. అందినవాడికి అందినంత. నలుగురికి విద్యాబుద్ధులు నేర్పుతున్నవాణ్ణి. ఎక్కడున్నాను? వాడి మాటలకు సిగ్గేసింది.

"నేను కాలేజీకి వెళ్ళి వస్తాను. పనివాడు టిఫిన్ తీసుకువస్తాడు... తిను"

"నీకు?"

"కాలేజి కేంటిన్‌లో తింటానులే"

"రాజీనామా వెంటనే అంగీకరిస్తారా?" అడిగాడు. వాడి ప్రశ్నలో అమాయకత్వం ఉంది, ఆత్రం ఉంది.

"వెళ్తోంది ప్రభుత్వ ఉద్యోగానికి కదా, కాదనకపోవచ్చు..." నా అనుమానాలు నాకు ఉన్నాయి.

గుడ్డలు మార్చుకుని కాలేజీకి వెళ్ళిపోయాను. మా క్వార్టర్స్‌కు అర ఫర్లాంగు దూరంలో కాలేజి ఉంది. వెళ్తూ పాపాజీతో ఈ మాటలు అన్నాను, "ఎవరయినా అడిగితే నేను మీ అన్నయ్యనని చెప్పకు. వేరేదేదయినా చెప్పు... స్పేర్ డ్రెస్ ఏమయినా తెచ్చుకున్నావా?"

"లుంగీ, తువ్వాలు తెచ్చుకున్నాను"

నా దగ్గర వేరే గుడ్డలున్నాయి. ఇవ్వడానికి మనసు ఆగింది.

కాలేజీకి వెళ్ళి తిరిగి వచ్చేసరికి పన్నెండు దాటింది. అదృష్టవశాత్తు

మేనేజ్‌మెంటు నా రాజీనామాకు ఏ అడ్డంకులు పెట్టలేదు. పాపాజీ చాపమీద ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. నేను వచ్చిన చప్పుడుకు మెలకువ వచ్చింది. ఒళ్ళు విరుచుకుంటూ లేచి కూర్చున్నాడు.

"ఏమయింది?" అడిగాడు.

"రాజీనామా అంగీకరించారు. కెమిస్ట్రీ లేబ్ మా జూనియర్‌కు అప్పగించి సాయంత్రం బయల్దేరతాను."

"కొద్దిసేపట్లో నేనూ బయల్దేరతాను" అని లేచి నుంచుని, "నా గుడ్డలు ఉతుక్కుని ఆరేశాను. ఆరి ఉండాలి" అన్నాడు. బాగా అలసిపోయినట్టున్నాడు. నిద్ర మత్తు పూర్తిగా వదిలినట్టు లేదు.

"టిఫిన్ తెచ్చాడా?"

"పెద్ద స్టీలు గిన్నెనిండా గారెలు తెచ్చాడు"

"అవన్నీ మనకు కాదు. ఆరో, పదో తీసుకోవాలి. మిగతావి వేరే క్వార్టర్స్‌లో ఉండేవాళ్ళకు... ఎన్ని ఉన్నాయేమిటి?"

"ఇరవయి పైచిలుకు ఉంటాయి. తెలియక అన్నీ తినేశాను. భోజనం చేసి రెండు రోజులవుతోంది. ఆకలికి ఆగలేకపోయాను."

మిగతావాళ్ళు, పని కుర్రాడు పాపాజీ గురించి ఏమని అనుకుని ఉంటారో? సర్దిచెప్పాలి.

అయిదు నిమిషాల్లో వెళ్ళిపోవడానికి తయారయ్యాడు. చొక్కా పంట్లాం పూర్తిగా ఆరలేదు. ఉండమని అనుంటే ఉండేవాడేమో! "డబ్బులున్నాయా?" అడిగాను.

"ఉన్నాయి" చేతి మడతలోంచి ఇరవయి రూపాయల నోటు తీసి చూపించి తిరిగి మడతల్లో పెట్టుకున్నాడు. మదనపల్లి నుండి గుంటూరు వెళ్ళడానికి ఇరవయి చాలవు.

"అవి సరిపోతాయా?"

"చాలు. మేనేజ్ చేసుకుంటాను"

నా దగ్గర డబ్బులున్నాయి. దారిలో వాడు బాధపడకూడదు. ఎంతో కొంత తీసి ఇద్దామనిపించింది. జేబులో చేయి పెట్టాను. నోట్లు తగిలాయి. తీయాలనిపించలేదు. వాడు వెళ్ళిపోతోంటే మెయిన్ గేటు వరకయినా వెళ్ళాలనిపించలేదు.

ఇంట్లోంచే, "జాగ్రత్తగా వెళ్ళు" అన్నాను.

వెనక్కి తిరిగి చూడకుండా తలూపాడు.

వాడు మదనపల్లి నుండి గుంటూరు వెళ్ళడానికి బయల్దేరాడో, ఏ కారణం చేతనయినా మధ్యలో ఆగిపోయాడో, దారిలో ఏమయినా జరిగిందో, ఏమో తెలియదు. గుంటూరు మటుకు చేరుకోలేదు.

దొసెడంత భవిష్యత్ మూట కట్టుకుని వెళ్ళిపోయినట్టయింది.

పాపాజీ నాకు ఆ సహాయం చేసి ఉండకపోతే నాకా ఉద్యోగం దొరికి ఉండేది కాదు. ఇంతటివాడిని అయి ఉండేవాడిని కాదు. ఆ మధ్య వైస్ ఛాన్సలర్ల సమావేశంలో పాల్గొన్నప్పుడు నన్ను ఎవరో అడిగారు, "మీరెంతమంది అన్నా తమ్ముళ్ళు?" ముగ్గురు తమ్ముళ్ళు, చెల్లెలు పేర్లు చెప్పాను. పాపాజీ పేరు వెంటనే గుర్తుకు రాలేదు. మదనపల్లి కాలేజి క్వార్టర్స్‌లో వాడు ఇరవయి పై చిలుకు గారెల సంఖ్య మటుకు గుర్తు వచ్చింది. అది చెప్పలేదు. తర్వాత ఆప్రశ్న అడిగిన రిపోర్టరు కోసం వెదికాను. కనిపించలేదు.